క్లుప్తంగా

ఇంటి పన్ను వసూళ్లు చేయాలి

బల్లికురవ: గ్రామ పంచాయతీల్లో ఇంటి పన్ను వసూళ్లను నూరుశాతం చేపట్టాలని ఎంపీడీవో సీహెచ్ కృష్ణ కోరారు. మండలంలోని 21 గ్రామ పంచాయతీల్లో రూ.1.35 కోట్లు ఇంటి పన్ను బకాయి ఉండగా ఇప్పటికి రూ.78 లక్షలు మాత్రమే వసూళ్ల చేపట్టామని నూరు శాతం ఇంటి పన్ను వసూళ్లకు ప్రజలు సహకరించాలని కోరారు. ఇంటి పన్ను వసూళ్లతో ఆయా గ్రామాలను అభివృద్ధి చేసుకోవచ్చని ఎంపీడీవో వివరించారు.

నేడు గృహసారథులు, కన్వీనర్లతో సమావేశం

బల్లికురవ: బల్లికురవలో సోమవారం మధ్యాహ్నం రెండున్నర గంటలకు గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లతో సమావేశం నిర్వహిస్తున్నట్లు మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్, సచివాలయ కన్వీనర్ చింతల పేరయ్య, టీ. నరేష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశాన్ని రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్ అద్దంకి వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య ముఖ్య అతిథిగా హాజరవుతారని చెప్పారు. సమావేశానికి గ్రామాల వారిగా ఎంపిక చేసిన గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, ఎంపీపీ, జెడ్పీటీసీ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, గ్రామ స్థాయి నేతలు విధిగా సకాలంలో హాజరు కావాలన్నారు.

గ్రామ దేవతలకు పూజలు


అలంకరణలో ఈర్ల గంగమ్మ

బల్లికురవ: మాఘ మాసం చివరి ఆదివారం సందర్భంగా మండలంలో వాడవాడలా గ్రామ దేవతలకు ప్రత్యేక అలంకరణలతో పూజలు చేపట్టారు. నక్కబొక్కలపాడు గ్రామ సమీపంలోని ఈర్ల కొండకు దిగువ భాగంలోం వేంచేసి ఉన్న ఈర్ల గంగమ్మ వద్ద పొంగళ్లు పెట్టి నివేదించి తమతమ మొక్కులు తీర్చుకున్నారు. బల్లికురవ, గుంటుపల్లి, చెన్నుపల్లి, వైదన, కొమ్మినేనివారిపాలెం, వైదన, వల్లాపల్లి, కొణిదెన గ్రామాల్లో గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలతో పాటు మహాశివరాత్రి సందర్భంగా శివపార్వతుల కల్యాణం, ఉత్సవ విగ్రహాలగ్రామోత్సవం కార్యక్రమాలను చేపట్టారు.

నాగవరపమ్మకు వెండి కాసుల పేరు బహూకరణ


ప్రత్యేక అలంకరణలో కనక నాగవరపమ్మ

వేటపాలెం: రామన్నపేట పంచాయతీ శివారులో పంట పొలాల్లో వేంచేసియున్న కనక నాగవరపమ్మ అమ్మవారికి భక్తుడు వెండి కాసులు పేరు ఆదివారం బహూకరించారు. ఈ సందర్భంగా ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు బండ్ల బాబు మాట్లాడుతూ దేశాయిపేటకు చెందిన బొడ్డు వీరమోహన్ అమ్మవారికి రూ.13,300 వేలు విలువగా వెండి కాసులు పేరు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో అచ్చంశెట్టి భానుమూర్తి పాల్గొన్నారు.

శింగరకొండ దర్శిని

అద్దంకి: శుభకృత్ నామ సంవత్సరం. ఉత్తరాయణం మాఘ మాసం ధనిష్ఠ నక్షత్రం పౌర్ణమి సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు చేస్తారని శింగరకొండ దేవస్థాన ఏసీ సుభద్ర ఆదివారం తెలిపారు. ఉదయం 5 గంటలకు సుప్రభాత సేవ, 5.30 గంటలకు బిందె తీర్థం. మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. సాయంత్రం 5.30 గంటలకు సువర్చలా సహిత దక్షిణాభిముఖ ప్రసన్నాంజనేయ స్వామి ఉత్సవ మూర్తులకు పల్లకీ సేవ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.


జాగో ముస్లిం వాల్‌పోస్టర్ ఆవిష్కరణ


వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న ముస్లిం, మైనార్టీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు

మార్టూరు: జాగో ముస్లిం చలో ఒంగోలు వాల్ పోస్టర్‌ను ఆదివారం మార్టూరులో ముస్లిం మైనార్టీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఆవిష్కరించారు. ఆసంఘ ప్రధాన కార్యదర్శి జాఫర్, జిల్లా ముస్లిం మైనార్టీ వెల్ఫేర్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు గడ్డం మస్తాన్ వలి ఆవిష్కరించారు. ఈ నెల 26వ తేదీ ఒంగోలులో నిర్వహించే జాగో ముస్లిం చలో ఒంగోలు కార్యక్రమానికి, జిల్లా ముస్లిం వెల్ఫేర్ కార్యాలయం ప్రారంభోత్సవాలకు ముస్లింలు రావాలని వారు కోరారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి సయ్యద్ కరిముల్లా, మండల యూత్ వైస్ ప్రెసిడెంట్ షేక్ కలాం, మసీద్ మౌసన్, పఠాన్ కరిముల్లా, అక్రమ్, జానీ బాషా పాల్గొన్నారు.

ఇళ్లు కావవి.. ఊళ్లు

- మినీ పట్టణాలుగా జగనన్న కాలనీలు
- శరవేగంగా సాగుతున్న ఇంటి నిర్మాణాలు
- నెరవేరుతున్న పేదల సొంతింటి కల
- నియోజకవర్గ వ్యాప్తంగా 7,167 ఇళ్లు మంజూరు


మినీ పట్టణంగా కనిపిస్తున్న వేలమూరిపాడు లే అవుట్

అద్దంకి: మాటిచ్చామంటే అంతే నేరవేర్చడమే లక్ష్యంగా సీఎం జగన్ మోహన్‌రెడ్డి ముందుకు వెళ్తున్నారు. తూతూ మంత్రంగా గత ప్రభుత్వం ఇళ్ల ఇస్తామని చెప్పి దారుణంగా మోసం చేసింది. జన్మభూమి కమిటీల పేరుతో అధికార మదంతో పేద ప్రజలను నానా ఇబ్బందులకు గురిచేసింది. వీటన్నింటికీ చెక్ పెడుతూ వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజల కష్టాలను గుర్తించి నెరవేరుస్తోంది. పేద ప్రజలకు గూడు ఏర్పాటు చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం స్థలాలు సేకరించి ఉచితంగా పట్టాలు పంపిణీ చేసింది. పంపిణీ చేసిన స్థలాల్లో ఇళ్ల మంజూరు చేయడం, ఇంటి నిర్మాణం మొదలు పెట్టిన లబ్ధిదారుల ఖాతాల్లో వెంట వెంటనే అధికారులు బిల్లులు మంజూరు చేస్తుండడంతో శరవేగంగా ఇంటి నిర్మాణాలు సాగుతున్నాయి. ఫలితంగా లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇళ్ల నిర్మాణంతో కాలనీలు మినీ పట్టణాలను తలపిస్తున్నాయి. పట్టణంతోపాటు నియోజకవర్గంలోని అద్దంకి, బల్లికురవ, సంతమాగులూరు, జే పంగులూరు, కొరిశపాడు మండలాల్లో 73 లే అవుట్లకు సంబంధించి మొత్తం 7,167 ఇళ్లు మంజూరయ్యాయి. అందులో అద్దంకి పట్టణంలో 2,337 ఇళ్లు మంజూరయ్యాయి. వీటిలో బేస్‌మెంట్ లెవెల్‌లో 1329, రూఫ్ లెవెల్‌లో 300, స్లాబ్ లెవెల్‌లో 431 ఉండగా, 13231 ఇళ్లు పూర్తయ్యాయి. అద్దంకి పట్టణంలోని వేలమూరిపాడు, నాగులపాడు, బొమ్మనంపాడు గ్రామాల సమీపంలో మూడు జగనన్న లే అవుట్లను ప్రభుత్వం 1684 ఇళ్లను మంజూరు చేసింది. సొంత స్థలాల్లో మరో 323 ఇళ్లు మండలంలోని 13 లే అవుట్లలో 198 ఇళ్లు ఇళ్లు, సొంత స్థలాల్లో 132 ఇళ్లు మంజూరయ్యాయి.

మండలం	మంజూరైన ఇళ్లు
అద్దంకి	2,762
బల్లికురవ	919
జే పంగులూరు	1200
సంతమాగులూరు	1317
కొరిశపాడు	969


కాలనీలో ఏర్పాటు చేసిన వీధిలైట్లు

243 ఇళ్ల నిర్మాణం పూర్తి..

పట్టణంలోని మూడు లే అవుట్లలో ఇప్పటి వరకూ 243 ఇళ్ల నిర్మాణం పూర్తయింది. 126 ఇళ్లు స్లాబ్ లెవెల్, 64 ఇళ్లు స్లాబ్ లెవెల్, 370 ఇళ్లు బేస్ మట్టాల లెవెల్‌లో ఉన్నాయి. కాంట్రాక్టర్ ద్వారా 70 ఇళ్లు నిర్మిస్తున్నారు, కాంట్రాక్టర్ ద్వారా నిర్మించే ఇంటికి లబ్ధిదారు రూ.90 వేలు నాలుగు దఫాలుగా చెల్లించాల్సి ఉంటుంది.

మౌలిక వసతుల కల్పించిన ప్రభుత్వం..

మూడు జగన్న కాలనీల్లో ఇప్పటికే తాగునీరు, కరెంట్, వీధి లైట్లు ఏర్పాటు చేశారు. కాలనీలో మంజూరైన స్థలాల్లో సగం ఇళ్ల బేస్ మెంట వేయగానే సీసీ రహదారి, డ్రైనేజ్ ఏర్పాటు చేస్తారు. ప్రస్తుతం ఉచితంగా నాలుగు ట్రక్కుల ఇసుక (20 టన్నుల ఇసుక) ఇస్తున్నారు. లబ్ధిదారు టన్నుకు రూ.175 చెల్లించాల్సి ఉంటుంది. అదే విధంగా తక్కువ ధరకు 342 కిలోలు. ఇనుము, రూ.272 ధరకు 90 కట్టలు సిసమెంట్ ఇస్తున్నారు. సిమెంటు ఇనుముతో కలుపుకుని ఒక్కో లబ్ధిదారుకు రూ.1.80లక్షలు ఇస్తున్నారు. దీంతో కాలనీల్లో ఇంటి నిర్మణాలు శరవేగంగా జరగుతున్నాయి.

లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకుంటే వెంటనే బిల్లులు..



ప్రభుత్వం మంజూరు చేసిన జగనన్న కాలనీల్లో లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకుంటే బేస్ లెవెల్, రూఫ్ లెవెల్, ఆర్‌సీ లెవెల్, కంప్లీషన్ పద్ధతిన నాలుగు దఫాలుగా బిల్లులు వెంటనే మంజూరు చేస్తున్నాం. ఉచితంగా నాలుగు టన్నుల ఇసుక, తక్కువ ధరకు సిమెంటు ఇస్తున్నాం. ఇంటి నిర్మాణం సొంతంగా చేసుకోలేని లబ్ధిదారుకు కాంట్రాక్టరు ద్వారా కట్టించి ఇస్తాం.

– కిరణ్‌కుమార్, హౌసింగ్ ఏఈ

హరిహరగోకులం క్షేత్ర నిర్వాహకుడికి అవార్డు


సుబ్బారావును సన్మానిస్తున్న పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి

అద్దంకి రూరల్: అద్దంకిలోని హరిహర గోకులం క్షేత్రం నిర్వాహకుడు గోనుగుంట సుబ్బారావుకు ఢిల్లీకి చెందిన బీసీఆర్ న్యూస్ మన రాష్ట్రం నుంచి బెస్ట్ సోషల్ అవార్డును సోమవారం ప్రకటించినట్లు సుబ్బారావు ఆదివారం తెలిపారు. సుబ్బారావు గత పదేళ్లుగా పర్యావరణాన్ని రక్షించే 10 వేల మట్టి వినాయక ప్రతిమలు అద్దంకి నగర వాసులకు అందిస్తున్నారు. పంటలను సంరక్షించి అధిక దిగుబడులు అందించేందుకు రైతులకు ఉచితంగా జీవామృతం అందించటం, ఆవుపేడ పిడకలతో తయారు చేసిన విభూదిని శ్రీశైలం వంటి ప్రముఖ దేవాలయాలకు ఉచితంగా అందజేయటం వంటి సామాజిక సేవలకు గుర్తింపుగా బెస్ట్ సోషల్ వర్కర్ గ్లోబల్ ఐకాన్ అవార్డును అందిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 24 వతేదిన ఢిల్లీలో జరిగే కార్యక్రమంలో అవార్డు అందుకోనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా గోసంరక్షణ సమితి అద్దంకి బాధ్యులు పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి సుబ్బారావును దుశ్శాలువాతో సత్కరించి అభినందించారు.

వృద్ధులకు నిత్యావసరాలు పంపిణీ


అన్నదానం చేస్తున్న దాతలు

మార్టూరు: మండల కేంద్రంలోని అమ్మ అనాథ్రశమంలో ఆదివారం దాతలు వృద్ధులకు అన్నదానం చేసి నిత్యావసరాలు పంపిణీ చేశారు. తూర్పుగోదావరి జిల్లా అంబాజీపేట వాస్తవ్యులు జీవీఎస్ మూర్తి, రాజ్యలక్ష్మి దంపతులు తమ కుమార్తె గోకవరపు మోక్ష పుట్టినరోజు సందర్భంగా తమ స్నేహితుడు నార్నె కోటయ్య ద్వారా ఆశ్రమంలో వృద్ధులకు అన్నదానం నిర్వహించారు. కొబ్బరి నూనె, పేస్టు, సబ్బులు వంటి నిత్యావసరాలు పంపిణీ చేశారు.

డ్రైవర్ కుటుంబానికి ఆర్థిక సాయం


ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్న విశ్వబ్రాహ్మణ సంఘ నాయకులు

అద్దంకి రూరల్: మండలంలోని మేదరమెట్ల వద్ద ఆదివారం జరిగిన కారుప్రమాదంలో అద్దంకి ఎస్సై సమందర వలి కుటుంబ సభ్యులతో మృతి చెందిన కారుడ్రైవర్ కొండముది వీరబ్రహ్మాచారి కుటుంబానికి బాపట్ల విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో సంఘ ప్రధాన కార్యదర్శి వెంకటాపురం ఆచారి రూ. 10 వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర కార్యదర్శి పొన్నపల్లి బ్రహ్మానందం, ప్రకాశం జిల్లా అధ్యక్షుడు చెన్నుపల్లి శ్రీనివాసాచారి, ఉపాధ్యక్షుడు ఆళ్లగడ్డ వీర సుందరాచారి, స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు జక్కుల బ్రహ్మం, రత్నాకర్, నూకతోటి అశోక్ పాల్గొన్నారు.

వైభవంగా లక్ష తులసీ దళార్చన


ప్రత్యేక అలంకరణలో చెన్నకేశవ స్వామి


స్వామివారికి పూజలు చేస్తున్న కరణం వెంకటేష్

- హాజరైన కరణం వెంకటేష్

వేటపాలెం: స్థానిక చెన్నకేశవ స్వామి దేవస్థానంలో స్వామి వారికి లక్ష తులసి దళార్చన మహోత్సవాన్ని పండితులు ఆదివారం వైభవంగా నిర్వహించారు. ముందుగా ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణలో స్వామివారి మహా శాంతి హోమం చేశారు. అనంతరం పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమానికి చీరాల నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ ముఖ్య అతిథిగా పాల్గొని స్వామి వారిని దర్శించుకొని పూజలు చేశారు. పండితులు వెంకటేష్‌ని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు నారాయణం అనంత పద్మానాభాచార్యులు, శ్రీనివాసుల హనుమాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

సొసైటీ బాధితుల ర్యాలీ


నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న బాధితులు

వేటపాలెం: వేటపాలెం కో–ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ బాధితులకు త్వరగా న్యాయం చేయాలని కోరుతూ ఆదివారం నిరసన ర్యాలీ నిర్వహించారు. బాధితులు మాట్లాడుతూ సొసైటీ నిధులు రూ. 24 కోట్లు గోల్ మాల్ జరిగి ఏడాదిన్నర దాటిందని గుర్తుచేశారు. విచారణలో మరో నలుగురు డైరెక్టర్లపై పోలీసు కేసులు నమోదు చేశారన్నారు. అయితే అందులో కేవలం ఇద్దరిని మాత్రమే అరెస్టు చేశారని తెలిపారు. మిగిలిన ఇద్దరిని త్వరగా అరెస్టు చేయాలని కోరారు. పోలీసులు విచారణను వేగవంతగా పూర్తి చేసి కోర్టులో చార్జిషీట్ నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో కారం చేటి శివరామకష్ణ, రమేష్‌బాబు, సుధాకర్, కష్ణమోహన్, రమణారెడ్డి పాల్గొన్నారు.

ఉచితంగా తోపుడు బండ్లు పంపిణీ


తోపుడు బండ్లు అందిస్తున్న రోటేరియన్లు

జే.పంగులూరు: పంగులూరు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక పంగులూరు బస్టాండ్ సెంటర్ నందు ఆదివారం చిరు వ్యాపారులకు తోపుడు బండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పంగులూరు రోటరీ క్లబ్ అధ్యక్షుడు పెంట్యాల జగదీశ్వరావు మాట్లాడుతూ ఆర్థికంగా వెనుకబడి అద్దె తోపుడు బండ్లలో వ్యాపారం చేస్తున్న ఎనిమిది మందిని గుర్తించి వారికి పంగులూరు రోటరీ క్లబ్ వారు ఉచితంగా బండ్లు అందజేశామని తెలిపారు. రోటరీ క్లబ్ రాష్ట్రం మొత్తం మీద చేయూత చక్రాల పంపిణీ కార్యక్రమం ద్వారా రాష్ట్రం మొత్తం 3 వేల తోపుడు బండ్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. పెంట్యాల జగదీశ్వరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రోటేరియన్లు రాయిని వెంకటసుబ్బారావు, జగన్, ఐ సుబ్బారావు, వీరరాఘవయ్య, జాగర్లమూడి సుబ్బారావు, శ్రీనివాసరావు, రామారావు, తులసీ తదితరులు పాల్గొన్నారు.

హరహర మహాదేవ శంభోశంకర


చినగంజాం: కల్యాణం నిర్వహిస్తున్న గంగా పార్వతీ సమేత నీలకంఠేశ్వరస్వామి


పర్చూరు: స్వామికి అభిషేకాలు నిర్వహిస్తున్న అర్చకులు


కృష్ణా జలాలు తీసుకెళ్తున్న మహిళలు


కారంచేడు శివాలయంలో ప్రత్యేక అలంకరణలో స్వామివారు

కారంచేడు/పర్చూరు/చినగంజాం: హర హర మహాదేవ శంభో శంకర ఓం నమో నమశ్శివాయ అంటూ భక్తులు చేసిన శివానామ స్మరణలతో శివాలయాలు మారుమోగాయి. శనివారం అర్ధరాత్రి 11 గంటల నుంచి ఆదివారం వేకువజాము వరకు సాగిన మహా శివరాత్రి పర్వదిన ప్రత్యేక పూజలతో భక్తులు పులకించిపోయారు. మండలంలోని కారంచేడు, స్వర్ణ గ్రామాల్లోని శివాలయాలతో పాటు, గ్రామ దేవత గంగమ్మతల్లి దేవాలయంలోను భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, లింగోద్భవ పూజలు నిర్వహించారు. పెదబజారు శివాలయంలో ఆలయ అర్చకులు కారంచేటి వీరాంజనేయశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అగస్త్యేశ్వర స్వామికి ఘనంగా కల్యాణ మహోత్సవం

- చెరుకూరు అగస్త్యేశ్వర స్వామి దేవస్థానంలో శనివారం అర్ధరాత్రి స్వామి వారికి లింగోద్భవ అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో సుమారు 300 మంది భక్తులు పాల్గొన్నారు. అనంతరం స్వామికి పల్లకి సేవ నిర్వహించారు. కార్యక్రమాలను దేవస్థాన సిబ్బంది, కార్యనిర్వాహణాధికారి నాగయ్య పర్యవేక్షించారు.
- చినగంజాం మండలంలోని చింతగుంపల గ్రామంలో వేంచేసియున్న గంగా పార్వతీ సమేత నీలకంఠేశ్వరస్వామి వారి కల్యాణ మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా కల్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించిన అనంతరం ఏకరుద్రాభిషేకం నిర్వహించారు. గ్రామంలోని భక్తులు 24 గంటలు పాటు భజన కార్యక్రమాలు నర్వహించారు. ఆలయ అర్చకులు వేణుశర్మ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో గ్రామంలోని భక్తులందరూ పాల్గొన్నారు.

శివరాత్రి తిరునాళ్లలో సాంస్కృతిక కార్యక్రమాలు

చినగంజాం: శివరాత్రి తిరునాళ్లను పురస్కరించుకొని చినగంజాం రామకోటేశ్వరస్వామి, కొత్తపాలెం బాలకోటేశ్వరస్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన విద్యుత్ ప్రభలు,సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. శివరాత్రి జాగరణలో భాగంగా భక్తులు శనివారం రాత్రి నుంచి ఆదివారం వేకువ జాము వరకు ఆలయ ప్రాంగణంలో వేచి ఉండేందుకు ఆలయ నిర్వాహకులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేయగా భక్తులు అత్యంత ఉత్సాహంగా తిలకించారు. తిరునాళ్ల సందర్భంగా పర్చూరు నియోజక వర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ ఆమంచి కృష్ణమోహన్, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావులు సందర్శించి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ వారికి శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. ప్రకాశం జిల్లా పంచాయతీ అధికారి జీవీ నారాయణ రెడ్డి ఆలయాలను సందర్శించి పూజా కార్యక్రమాలను నిర్వహించారు.


బాలకోటేశ్వర స్వామి ఆలయంలో ఆమంచిని దీవిస్తున్న అర్చకుడు


రామకోటేశ్వర స్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన విద్యుత్ ప్రభలు


రామకోటేశ్వరాలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన దేవుళ్ల విద్యుత్ కటౌట్‌లు

జిల్లా స్థాయిలో విద్యార్థుల ప్రతిభ


సృజన


వంశీకృష్ణ

జే.పంగులూరు: జనవరిలో జరిగిన ఎడ్యుకేషనల్ ఏపీ ఫణి మెరిట్ టెస్ట్ ఫలితాల్లో చందలూరు విద్యార్థులు మంచి ప్రతిభను కనబరిచారు. ఆదివారం విడుదలైన ఫలితాల్లో చందలూరు పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థిని గొట్టిపాటి సృజన 4వ ర్యాంక్, 7వ తరగతికి చెందిన కట్టా వంశీకృష్ణ జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించారు. మంచి విజయం సాధించిన విద్యార్థులకు హెచ్‌ఎం గుమ్మా శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

గుడ్‌న్యూస్ ఆశ్రమంలో సేవా కార్యక్రమాలు

ఒంగోలు టౌన్: నగరంలోని కర్నూలు రోడ్డులో గల గుడ్ న్యూస్ అంధుల ఆశ్రమంలో ది హోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పిల్లలకు నిత్యావసర సరుకులు అందజేయడంతో పాటు వారి చదువులకు, అనారోగ్యంతో బాధపడుతున్న ఒక బాలికకు చికిత్స కోసం నగదు అందజేశారు. అంధ విద్యార్థులకు సహాయం అందజేసిన హోప్ ఫౌండేషన్ చేపడుతున్న కార్యక్రమాలను హోం ఇన్‌చార్జి మోహన్ అభినందించారు. ఇలాంటి సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో ఫౌండేషన్ వ్యవస్థాపకులు తేళ్ల కిరణ్‌కుమార్, సిద్దిక్, రాజశేఖర్, యశ్వంత్, పరంజ్యోతి, మస్తాన్ పాల్గొన్నారు.